
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 3 సెప్టెంబరు 2024





కొల్లిపర మండలం లంక గ్రామాల ప్రజలను పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు



తాడేపల్లి : చిర్రావూరు వద్ద కృష్ణానది లంకల్లో ఉన్న గేదెలను పడవలో తీసుకువస్తున్న దృశ్యం



కొల్లూరు: వరదతో రెండోఅంతస్తుపై ఓ కుటుంబం

లంక గ్రామాలన్నీ..

జల దిగ్బంధం



కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం నుంచి పడవ ద్వారా మొక్కజొన్నలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రైతులు



దుగ్గిరాల : చిర్రావూరు సమీపంలో నీటిలో తేలియాడుతున్న అరటితోట



కొల్లిపర: వల్లభాపురం వద్ద ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్



కొల్లూరు : వరద ప్రభావిత ప్రాంతాలను మ్యాప్ ద్వారా మంత్రి గొట్టిపాటి, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబుకు వివరిస్తున్న కలెక్టర్

ఎటు చూసినా వరద నీరు. అంతా చిమ్మ చీకటి. అడుగు బయటకు పెట్టాలంటే భయం. పాములు, విష కీటకాలతోనే సహజీవనం. వీటన్నిటికీ తోడు వరదలకు ముందే గ్రామాలకు గ్రామాలు జ్వరాలతో మంచం పడితే, ఇప్పుడు వారికి వరద నీటిలో మందులు అందక, కొన్ని గ్రామాల్లో తాగటానికి గుక్కెడు నీరు దొరక్క, వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతమే. కృష్ణా నదీ వరద ముంపు లంక గ్రామాల్లో పరిస్థితి ఇదీ. రెండు రోజుల నుంచి వరద ముంచెత్తి, ఊళ్ళను చుట్టుముడితే అంతగా వరద ప్రభావం ఉండదని భరోసాతోఉన్న స్థానికులు చాలామంది పశువులను వదిలేసి, ఇళ్లనుంచి బయటకు రావటానికి ఇష్టపడలేదు. 2009 తర్వాత ఇంత భారీ స్థాయిలో కృష్ణా నదికి వరద వచ్చిందిలేదు. 2009లో తమ ఇళ్లు భద్రమని, మునగలేదు కనుక తమ ఇళ్లలోనే ఉండొచ్చని ధీమాగా ఉన్న వారంతా ఇప్పుడు భయపడిపోతున్నారు. ప్రకాశం బ్యారేజి నుంచి సోమవారం మధ్యాహ్నం నుంచి కూడా 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వస్తూనే ఉంది. ఎగువ బ్యారేజీల నుంచి వరద నీరు తగ్గినా, మునేరు, పాలేరు, కీసర, బుడమేరు వాగులు ఇంకా పొంగి ప్రవహిస్తూనే ఉండటంతో అధికారులు కూడా ఒక అంచనా వేయలేకపోయారు. వరద ప్రవాహ వేగం కూడా అంచనాలేకపోవటం, అరవింద వారధి దగ్గర చిన్నపాయ అడ్డుకట్ట తెగిపోవటంతో ఒకేసారి వరద నీరంతా ఊళ్లపై పడటంతో మరింత నష్టం ఏర్పడినట్టయింది. దీంతో వరద నీటి ప్రభావం సోమవారం భారీగా పెరగటంతో నీరు చేరని ఇల్లే లేదంటే అతిశయోక్తి కాదు.

బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు గుప్పిటపట్టి..

- చుట్టూ చిమ్మచీకటి... పాములతో సహజీవనం
- వరద నీటిలోనే లంక గ్రామవాసులు
- జ్వరాలతో పడకేసి... మందులులేక దిక్కు తోచక
- సాయం అందించాలన్నా కష్టమైపోయి

గుంటూరు, మంగళగిరి, దుగ్గిరాల, తాడేపల్లి టౌన్, కొల్లిపర సెప్టెంబరు 2, (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి దిగువన తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని లంక గ్రామాలన్నీ జలదిగ్బంధంలోనే చిక్కుకుపోయాయి. అయితే ఈ ప్రాంతాలకు పగలు కొద్దిసేపు, రాత్రి కొంత సమయం విద్యుత్తు సరఫరా ఇస్తుండటం, కొన్ని గ్రామాలకయితే రెండు రోజుల నుంచి విద్యుత్తు లేకపోవటంతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. రాత్రయితే చుట్టూ చీకటి కమ్మేసి ఉండటం, అంతా నీరు నిండిపోవటంతో పొలాలపై, పొదల్లో ఉన్న విష సర్పాలు, కీటకాలు ఇళ్లలోకి చేరిపోతున్నాయని వారు ప్రాణ భయంతో చెబుతున్నారు. నీటిలో వాటిని ఏమీ చేయలేకపోతున్నామని, వాటితో కలసి సహజీవనం చేయటం మినహా చేసేదేమీలేకుండా ఉందనేది బాధితుల ఆవేదన. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం కనిగిరిలంక వాసులను నది మధ్య నుంచి కొల్లూరు మండల కేంద్రానికి తరలించేందుకు పడవపై ప్రయత్నం చేస్తే అది చెట్టుకు ఢీకొని పెద్ద ప్రమాదమే తప్పింది. దీంతో అధికారులు కూడా వారిని ఇంతటి ప్రవాహ వేగం ఉన్న తరుణంలో బయటకు తీసుకురావటం ఇబ్బందిగా మారటంతో ఆహార పొట్లాలను లంక గ్రామాలకే పంపుతు న్నార ౦ . అయి



తే అవన్నీ కొన్ని గ్రామాలకు, కొన్ని ఇళ్లకే అందుతున్నాయని, మిగిలిన వారు ఆకలితోనే అలమటించాల్సి వస్తోందని వాపోతున్నారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం మొత్తం వరద ముంపులో చిక్కుకుపోయింది. అక్కడి నుంచి 50 మందికిపైగా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే లోపల ఉన్న లంకల నుంచి బయటకు తీసుకురావటానికి అధికారులు భయపడాల్సిన పరిస్థితి. ఇటు కొల్లూరు మండలంలోనూ కరకట్టకు దగ్గర్లోఉన్న పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పోతార్లంక, జువ్వలపాలెం, కిష్కింధపాలెం, తిప్పలకట్ట, భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, మరికొన్ని గ్రామాల వారినికూడా దరికి చేర్చలేని పరిస్థితి. వారికి అవసరమైన ఆహారం, తాగునీటి సరఫరాకే అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ఆహార పొట్లాలు గ్రామాల్లో సచివాలయాల దగ్గర పెట్టేసి వెళ్లటం, కొన్ని పొట్లాలు ప్యాకింగ్ కూడా లేకుండా పంపటంతో తినటానికి పనికిరాకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార పొట్లాలు ఆలస్యం కావటం, పొట్లాలు సరిగాలేకపోవటంపై ఎమ్మెల్యే ఆనందబాబు అధికారులపై మండిపడ్డారు. మీకు కుదరదంటే కార్యకర్తలతో పంపుతానని, పనిచేయలేనివారు వెళ్లిపోవచ్చని సిబ్బందిని హెచ్చరించారు. అయితే వీటితోపాటు మందులు, వైద్య సిబ్బందిని కూడా గ్రామాలకు పంపగలిగితే బతుకుతామని, లేకుంటే వరద భయంతోపాటు, రోగాలతో చనిపోతామని వారు కన్నీరుమున్నీరవుతున్నారు.



తాడేపల్లి మహానాడు ప్రాంతంలో వరదనీటిలో ప్రజల కష్టాలు



దుగ్గిరాల: పెదకొండూరు వద్ద నీట మునిగిన శ్రీకనకపుట్టలమ్మతల్లి ఆలయం



తాడికొండ-కంతేరు రోడ్డులో వరదనటి ప్రవాహానికి కొట్టుకుపోయిన రోడ్డు



అరవింద వారధిపై నుంచి వెళుతున్న వరద నీరు

కృష్ణానది దిగువకు..

భారీగా వరద ఉధృతి

కొనసాగుతున్న 2వ ప్రమాద హెచ్చరిక

ఎగువ నుండి వరద ఉధృతి భారీగా కొనసాగుతుండడంతో ప్రకాశం బ్యారేజి దిగువన కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. సోమవారం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు 11లక్షల 27వేల 801 క్యూసె క్కుల వరద నీరు వస్తుండగా 70 గేట్లను పూర్తిగా ఎత్తి దిగువకు 11 లక్షల 27 వేల 301 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తు న్నారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 23.7 అడుగుల నీటి మట్టం కొనసాగు తోంది. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు. ఇప్పటికే అధికారులు జారీ చేసిన 2వ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. సోమ వారం ఉదయం 11లక్షల 41 వేల 701 క్యూ సెక్కులు నమోదు కాగా సాయంత్రానికి 11లక్షల 27 వేల 301 క్యూసెక్కులు బ్యారేజి నుండి దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలి పారు. బ్యారేజి వద్ద వరద ఉధృతి స్వల్పంగా 15వేల క్యూసెక్కులు తగ్గింది.

ఇంకా కోలుకోని మంగళగిరి శివార్లు

రెండు రోజులుగా వాతావరణం తెరిపిచ్చినప్పటికీ మంగళగిరి నియోజకవర్గంలో ముంపు ప్రాంతాలు ఇంకా తేరుకోలేదు. శివారు, లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలోనే వున్నాయి. ముంపు ప్రాంత బాధితులను ఆదుకోవాలని మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన పిలుపునకు టీడీపీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. మంత్రి లోకేశ్ సహకారం తో మంగళగిరి మండలం నీరుకొండ వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ముంపు ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

ప్రాణ నష్టం జరిగితే సహించం : మనోహర్

ఎటువంటి ప్రాణనష్టం..పశునష్టం జరిగినా సహించేది లేదని అధికారులందరూ వరద ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. సోమవారం ఆయన కొల్లిపర మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, అన్నవరంలంక, పిడపర్తిపాలెం, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో పర్యటించారు. కృష్ణానదికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని బొమ్మువానిపాలెం, అన్నవరంలంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తక్షణమే తరలించాలని అధికారులను ఆదేశించారు. అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, పిడపర్తిపాలెం సమీపంలో వరద ఉధృతికి కృష్ణానది కరకట్ట పలుచోట్ల కోతకు గురికావటంతో ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతుందని తెలిసి ఎందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టలేదని వారిపై మండిపడ్డారు. కోతకు గురిఅయినచోట తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, నాయకులు వెంటనే ఇసుకను తొలగించడంతో మంత్రి మనోహర్ దగ్గర ఉండి ఇసుకను గోతాలలో పోయించి కోతకు గురైన చోటవేయించారు.

800 మంది పునరావాస కేంద్రాలకు తరలింపు

తాడేపల్లిలో ప్రకాశం దిగువన ఉన్న మహానాడు ప్రాంతం నీట మునిగింది. కరకట్టకు ఇవతల నదీతీరంలో 2 వేల కుటుంబాలు వరద ప్రభావానికి గురయ్యాయి. ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పది లక్షల క్యూసెక్కులు దాటగానే నదీతీరంలో ఉన్న ఇళ్లలోకి వరదనీరు చేరింది. అప్రమత్తమైన మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం వారందరిని పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రగతి, ప్రతిభ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో 800మందిని తరలించినట్టు ఎంటిఎంసి డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు.

దుగ్గిరాల మండలంలోని కరకట్ట అంచున వున్న కృష్ణాతీర గ్రామాలైన వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామస్తులు ముంపు భయంతో వణికిపోతున్నాయి. పెదకొండూరులోని కరకట్ట లోపలివైపున వున్న వందలాది ఎకరాల వాణిజ్యపంటలు పసుపు, అరటి, కంద, చేమ, బొప్పాయి తోటలు వరదనీటిలో పూర్తిగా మునిగిపోయాయి. పెదకొండూరులోని పురాతన ఆలయాలు శ్రీరాజేశ్వర స్వామి, శ్రీఆనందేశ్వరస్వామి, శ్రీజనార్ధనస్వామిఆలయాలు, శ్రీకనకపుట్టలమ్మతల్లి ఆలయాలు మునిగిపోగా హిందూ, క్రైస్తవ స్మశాన వాటికలు కంటికి కనిపించకుండా పూర్తిగా మునిగిపోయాయి. గొడవర్రు, అత్తలూరిపాలెం మధ్య కరకట్ట బలహీనమై కోతకు గురవుతున్న రెండుచోట్ల ఇసుకబస్తాలతో అడ్డుకట్టవేయడంతోపాటు, కంకర ఇసుకకలిపి కట్టగా పోసి కరకట్టను బలోపేతం చేసే ప్రయత్నం చేస్తున్నారు. తాడికొండ మండలంలో కొండవీటి వాగు, ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించటంతో జనజీవనం స్థంభించింది. ఎర్రవాగుతో తాడికొండ- కంతేరు గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. కంతేరు ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా అడ్డరోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన రైల్వే బ్రిడ్జి పూర్తిగా నీటిలో మునిగిపోయింది. దీంతో రెండు రోజుల నుంచి నేషనల్ హైవే నుంచి కంతేరుకు రాకపోకలు నిలిచిపోయాయి. గుంటూరులోని బస్టాండు, పల్నాడు బస్టాండు, ప్రగతి నగర్, చుట్టు గుంట, ఎల్ఆర్ కాలనీ, సంగడిగుంట, కమ్మ శేషయ్య గ్రౌండ్ ఇలా అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు మోకాళ్ళ లోతు నీరు నిల్వ ఉంది.

తాడేపల్లి : కృష్ణానదిపై రైలు వంతెనలను తాకుతూ ప్రవహిస్తున్న వరద నీరు



13 లక్షల క్యూసెక్కులు వచ్చినా తట్టుకునేలా..

సోమవారం అనేకచోట్ల నుంచి వరుసగా కరకట్టకు గండ్లు పడుతున్నాయంటూ అధికారులకు ఫోన్ కాల్స్ రావటంతో అటూ ఇటూ పరుగులుపెట్టారు. గత ప్రభుత్వం కృష్ణా నదికి ఐదేళ్లలో పలుమార్లు వరద వచ్చినా, కరకట్ట భద్రత, దానిని పటిష్టపరచాలనే ఆలోచనకూడా చేయకపోవటంతో ఇప్పుడు దాని ప్రభావం తీర గ్రామాలపై పడుతోంది. సోమవారం ఉదయమే కొల్లిపర మండలం వల్లభాపురం, అత్తలూరివారిపాలెం దగ్గర కరకట్ట కోతపడిపోయిందని, ఇంకా అడుగుమేర నీరు పెరిగితే గండి పడిపోతుందంటూ స్థానికులనుంచి సమాచారం రావటంతో అధికారులు ఉరుకులు పరుగులమీద అక్కడికి చేరుకున్నారు. అదే సమాచారం తెలిసి రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. అప్పటికప్పుడు ఇసుక, ఎర్రమట్టి తెప్పించి, బస్తాలకెత్తించి కోతపడిన చోట రక్షణగా వేయించారు. పలుచోట్ల ఇదే పరిస్థితి ఉండటంతో వాటికి అడ్డుగా మూటలు వేయగలిగారు. దీంతో అక్కడ ప్రమాదం తాత్కాలికంగా తప్పింది. ఆ తర్వాత కొల్లూరు మండలం దోనేపూడి-కోటిపల్లి మధ్య కరకట్టకు గండిపడుతోందంటూ సమాచారం రావటంతో అప్పటికే కొల్లూరులో పర్యటిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఆనందబాబు, నరేంద్రవర్మలు జిల్లా కలెక్టర్‌తో కలసి ఉండటంతో గండ్ల పరిస్థితులపై సమీక్షించారు. వెంటనే సిబ్బందిని అక్కడకు పంపించి గండ్లు పడకుండా అడ్డుకట్టలు వేసేలా ఆదేశాలిచ్చారు. అయితే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని, కరకట్ట ఎక్కడ బలహీనంగా ఉంటే అక్కడ అడ్డు కట్టలు వేయించాలని, రేపటి రోజున 13 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా తట్టుకునేలా పనులు ఉండాలని, వాటిని యుద్ధప్రాతిపదికన చేయగలిగేవారికి అప్పగించి పూర్తిచెయ్యాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు.



కొల్లూరు కరకట్ట వద్ద సముద్రాన్ని తలపిస్తున్న కృష్ణ ప్రవాహం



కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తాడేపల్లి మహానాడు వద్ద ముంపు బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి





సీతానగరం రైలు వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న విజీ త్రిపాఠి

గత పాపం.. నేటి శాపం..!

- కరకట్టల పటిష్టతను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- వాటి సమీపంలో గతంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- నేడు నీటి ప్రవాహ ఉద్ధృతికి విస్తృతంగా లీకులు
- తీవ్ర భయాందోళనలో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు
- బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన 30 గ్రామాలు



భట్టిప్రోలు: లంక గ్రామాల్లో చిక్కుకున్న తమ వారి వివరాలు తెలుసుకోవడానికి వెల్లటూరు కరకట్ట వద్దకు చేరుకున్న బంధువులు



రేపల్లె: ఎక్స్‌కవేటర్‌తో ఓలేరు కరకట్టకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం



రేపల్లె: ట్రాక్టర్ ద్వారా కరకట్టపై వేస్తున్న ఇసుక బస్తాలు

బాపట్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాలనలో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఉన్న కరకట్టల పటిష్టానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా కరకట్టల సమీపంలో కూడా నిబంధనలు ఉల్లంఘించి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకున్న ఘనత గత వైసీపీ ప్రభుత్వానిది. 2019 ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా కరకట్టలను బలోపేతం చేయడానికి ప్రణాళికలు రూపొందించడంతో పాటు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని మాజీ సీఎం జగన్ హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల పాలనలో వాటి పటిష్టానికి ఒక్క రూపాయి విదిల్చిన పాపాన పోలేదు. వాటికి కనీస మరమ్మతులు కూడా ఏళ్ల తరబడి చేయకపోవడంతో అవి లీకుల దశకు కొన్నిచోట్ల, గండ్లుపడి మరికొన్ని చోట్ల ప్రమాదస్థితికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఎడతెరిపిలేని వర్షాల కుతోడు పైనుంచి వరదనీరు ప్రకాశం బ్యారేజీకి పోటెత్తడంతో రికార్డు స్థాయిలో గత శతాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా 11.5 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో కొల్లూరు, రేపల్లె, భట్టిప్రోలు మండలాల పరిధిలోని 30 లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రకృతి ప్రకోపానికి ఆ గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమం టూ కాలం వెళ్లదీస్తుంటే గత ప్రభుత్వ తప్పిదాలకు కరకట్టలకు లీకులై ఏ క్షణాన గండి పడి మెరకన ఉన్న ఊళ్లను కూడా ముంచెత్తుతాయనే భయం నెలకొంది. ముఖ్యంగా భట్టిప్రోలు మండల పరిధిలోని పెదపులివర్రు కరకట్టకు పడ్డ లీకులు రేపల్లె ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది

ఓ వైపు నీటమునిగిన లంక గ్రామాలు...

లంకల పరిధిలో ఉన్న 30 గ్రామాల ప్రజలకు ఆదివారం రాత్రి నుంచే బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సోమవారం ఉదయానికి రెండు వేల మందిని పునరావాసా శిబిరాలకు తరలించిన అధికారులు, గ్రామాల్లో చిక్కుకుపోయిన వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్న వారిమీద దృష్టి పెట్టి బయటకు తీసుకొచ్చారు. లంక గ్రామాల్లో కరెంటు సరఫరాను నిలిపివేసి జనరేటర్ల ద్వారా విద్యుత్‌ను అందిస్తున్నారు. వారికి అవసరమైన ఆహారాన్ని పడవల ద్వారా గ్రామాల్లోకి అధికారులు పంపిస్తున్నారు. లంక గ్రామాల్లోకి వెళ్లే మార్గాలను నాలుగు పాయింట్లుగా విభజించి అక్కడ ఇద్దరు అధికారులను ఇన్చార్జిలుగా నియమించారు.

మరోవైపు కరకట్టలకు లీకులు

భట్టిప్రోలు మండల పరిధిలోని పెదపులివర్రు కరకట్టతోపాటు ఓలేరు పల్లెపాలేనికి లీకులు పడడంతో యంత్రాంగం పరుగులు పెట్టింది. ఇసుక బస్తాలు, కంకరతో వాటిని పూడ్చే ప్రయత్నం చేస్తున్నా, పైనుంచి వస్తున్న వరద ప్రవాహం ధాటికి కరకట్టకు సమానంగా నీళ్ల ప్రవహిస్తుండడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న టెన్షన్ అక్కడి ప్రజల్లో నెలకొంది. ముఖ్యంగా పెదపులివర్రు కరకట్టకు గండి పడే ప్రమాదం పొంచి ఉందనీ, అదే జరిగితే ఆ నీరు రేపల్లె పట్టణాన్ని ముంచెత్తే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా రేపల్లె పట్టణ ప్రజానీకాన్ని జిల్లా కలెక్టర్ వెంకటమురళి అలెర్ట్ చేశారు. పెదపులివర్రు కరకట్ట వద్ద జరుగుతున్న పనులను పరిశీలించడానికి వెళ్లిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, జిల్లా కలెక్టర్ వెంకటమురళి ప్రతి గంటకు ఆరా తీసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

రికార్డు స్థాయిలో వరద

10 లక్షల క్యూసెక్కుల వరదను కూడా గతంలో చూసిన లంక గ్రామాల ప్రజలు ప్రస్తుతం వచ్చిన 11.5 లక్షల క్యూసెక్కుల ప్రకాశం బ్యారేజీ ప్రవాహాన్ని శతాబ్ద కాలంలో ఎప్పుడూ చూడలేదని, ఈ స్థాయిలో వరద బీభత్సం ఊహించలేదని లంక గ్రామాల ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు. దిగువకు వస్తున్న వరద ప్రవాహానికి తోడు సముద్రం ఆటుపోట్లు అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు ప్రజలను మరింత కలవరపెడుతున్నాయి. పెదపులివర్రు కరకట్టకు లీకులు ఏర్పడడంతో యంత్రాంగం రేపల్లె ప్రజలను అప్రమత్తం చేసింది. 2009లో ఓలేరు కరకట్టకు గండిపడి నీటి ప్రవాహం ముంచెత్తి ఆనాడు మిగిల్చిన చేదు జ్ఞాపకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

సహాయక చర్యలపై మంత్రి గొట్టిపాటి ఆరా..

వరద ఉద్ధృతికి ముంపునకు గురైన పొలాలతోపాటు కొల్లూరు మండల పరిధిలోని లంక గ్రామాల్లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పర్యటించి బాధితులకు అందుతున్న సహాయంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత బాపట్ల నియోజకవర్గ పరిధిలోని కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో ముంపునకు గురైన పొలాలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కనీసం కాలువల్లో పూడికతీత కూడా చేపట్టక పోవడం వల్లే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు మంత్రి ముందు వాపోయారు. అన్నదాతలను అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఆనంద్‌బాబు, వేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ ఉన్నారు.

పెరుగుతున్న వరద ఉధృతి

రేపల్లె, సెప్టెంబరు 2: కృష్ణానది నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. రావిఅనంతవరం, పల్లెపాలెం, మైనేనివారిపాలెం, కనగాలవారిపాలెం, రుద్రవరం గ్రామాల వద్ద కరకట్టలు బలహీనంగా ఉండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు కరకట్ట పల్లపు ప్రాంతాల్లో ఇసుక గోతాలతో కట్టలను అభివృద్ధి పరుస్తున్నారు. రావిఅనంతవరం వద్ద ఇసుక కట్టలు వేసినప్పటికీ నీరు కట్టదాటుతూనే ఉంది. అయితే అధికారులు గ్రామస్థులను చైతన్యపరిచి నీరు కట్ట దాటకుండా ఇసుకమట్టితో అడ్డుకట్ట వేస్తూనే ఉన్నారు. బలహీనంగా ఉన్న కరకట్టలను గత ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. మండలంలోని పల్లెపాలెం గ్రామం పూర్తిగా నీటిలో నిలిచిపోయింది. గ్రామంలోని ప్రజలను బోటు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి వారికి సహాయ, సహకారాలు అందిస్తుంది. పల్లెపాలెంలో మత్స్యకారులు బోటులోనే జీవనం సాగిస్తున్నారు. వరదకు రొయ్యల చెరువులు, పంట పొలాలు ముంపునకు గురై లక్షలాది రూపాయల నష్టం జరిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెనుమూడి వద్ద ఆంజనేయస్వామి, రావిఅనంతవరం వద్ద శివాలయం, మోర్తోట దేవాలయాలు పూర్తిగా నీటిలో ఉన్నాయి. ఎన్‌జీఆర్‌ఎఫ్ బృందం, గజఈతగాళ్లు ఎప్పటికప్పుడు వరద ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారు.



భట్టిప్రోలు: పెదపులివర్రు కరకట్ట పరిస్థితిపై వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి



రేపల్లె: పల్లెపాలెంలో పడవలోనే జీవనం



రేపల్లె: పల్లెపాలెం నివాసాల్లోకి వరదనీరు...



బోటులో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న రేపల్లె అధికారులు

కొనసాగుతున్న రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వర్షం తగ్గినా వరద సృష్టించిన బీభత్సం కారణంగా రైల్వేట్రాక్‌లు దెబ్బతినడంతో మంగళవారం కూడా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్‌సిటీని ఈ నెల 3న, 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీని ఈ నెల 4న రద్దు చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం నంబరు. 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేశారు. 22702 గుంటూరు - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌ని కూడా సోమవారం రద్దు చేశారు. ఈ నెల 3న 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి, 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ, ఈ నెల 2 సోమవారం 12703 హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమాని రద్దు చేశారు. కాగా ఇంకా రైల్వేట్రాక్ మరమ్మతులు పూర్తి కాని దృష్ట్యా కొన్ని రైళ్లను నడికుడి మార్గంలో మళ్లించనున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. వాటిల్లో నంబరు. 18046 హైదరాబాద్ - షాలిమార్, 12728 హైదరాబాద్ - విశాఖపట్టణం, 12764 సికింద్రాబాద్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 3వ తేదీన పగిడిపల్లి, నడికుడి మార్గంలో నడపనున్నట్లు చెప్పారు.

ఎటువంటి నష్టం జరిగినా సహించేది లేదు

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 2: ఎటువంటి ప్రాణ నష్టం, పశునష్టం జరిగినా సహించేది లేదనీ, అధికారులందరూ వరద ప్రవాహిత ప్రాంతాల్లో 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని బొమ్మువానిపాలెం, అన్నవరంలంక, పిడపర్తిపాలెం, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో మనోహర్ అధికారులతో కలిసి పర్యటించారు. కృష్ణానదికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని బొమ్మువానిపాలెం, అన్నవరంలంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తక్షణమే తరలించాలని అధికారులకు ఆదేశించారు. అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, పిడపర్తిపాలెం సమీపంలో వరద ఉధృతికి కృష్ణానది కరకట్ట పలుచోట్ల కోతకు గురవటంతో ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణానదికి వరద పెరుగుతుందని తెలిసికూడా ఎందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టలేదని వారిపై మండిపడ్డారు. కోతకు గురైనచోట తక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. ఇరిగేషన్, నాయకులు వెంటనే ఇసుకను తోలించడంతో మంత్రి మనోహర్ దగ్గర ఉండి ఇసుకను గోతాల్లో పోయించి కోతకు గురైనచోట వేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మనోహర్ వరదప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కృష్ణానదికి 11లక్షల 60వేల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. మండలంలోని వల్లభాపురం వద్ద కరకట్ట కోతకు గురవటంతో విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. మంత్రి వెంట సబ్‌కలెక్టర్ సంధ్యాసింహ, జాయింట్ కలెక్టర్ భార్గవ్, డీఎస్పీ బి.జనార్ధనరావు, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..

- ఉప్పలపాడు బాధితులకు ధైర్యాన్ని నింపిన నరేంద్ర కుమార్



ఉప్పలపాడు బాధిత కుటుంబానికి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, ఆ సెప్టెంబరు 2: మీకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది.. అధైర్య పడకండి.. నేను ఉన్నా.. అంటూ పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఉప్పలపాడు బాధిత కుటుంబాలకు సోమవారం భరోసా కల్పించారు. అకాలవర్షం వలన వరద ఉధృతికి పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో మరణించిన పసుపులేటి సాదీస్(8), నడింపల్లి రామవేంద్రరావు(40), తోట శ్రీనివాసరావు (60) (కొప్పురావూరు) కుటుంబసభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న ఎక్స్ గ్రేషియా రూ.5 లక్షల నష్టపరిహారం చెక్కును ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణకాంత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిక్కిన భారీ చేప



మత్స్యకారుల వలలో చిక్కిన 22 కిలోల భారీచేప

దుగ్గిరాల, సెప్టెంబరు 2: దుగ్గిరాల కొమ్మమూరు కాల్వలోకి 22 కిలోల భారీ చేప కొట్టుకువచ్చింది. రుచిలో పులస చేప తర్వాత బొచ్చకు పేరు. ఆలీనగర్ సమీపంలో మత్స్యకారుల వేసిన వలకు బొచ్చ చిక్కడంతో వారు తమ పంట పండిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత 20 ఏళ్లలో ఇంత పెద్దచేప కాల్వలో కనిపించడం ఇదే ప్రథమంగా చెబుతున్నారు. భారీ చేపను స్థానిక ముస్లింలు రూ.4,200 కొనుగోలు చేశారు. సముద్రంలోనూ, నదులలోనూ భారీచేపలు పడటం సహజమేనని, కాల్వల్లో నిత్యం కొట్టుకువచ్చే చేపలు ఐదు నుంచి 10 కిలోలకు మించి ఉండవని, కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా ఈ భారీచేప కొట్టుకు వచ్చినట్లు చెబుతున్నారు. దాదాపు 14 ఏళ్ల క్రితం 250 కిలోల భారీ టేకు చేప కొమ్మమూరు కాల్వలో మత్స్యకారులు వేసిన వలలో పడిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ఐతే టేకు చేప తినేందుకు పనికి రాకపోవడంతో దీనిని తిరిగి ఓ వాహనంలో తీసుకెళ్ళి సముద్రంలో వదిలివేశారు.

రైల్వే అధికారుల నిర్లక్ష్యం.. వ్యక్తి మృతి



తోట శ్రీనివాసరావు మృతదేహం

పెదకాకాని, సెప్టెంబరు 2: రైల్వేశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామ శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఈ ఘోరం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు(60) హైవేపై ఉన్న హోటల్లో పని చేసేవాడు. గత రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగివెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ కొప్పురావూరు రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఉన్న నీటిలోపడి చనిపోయాడు. రైల్వే అధికారుల కు గ్రామస్తులు ఎన్నిసార్లు చెప్పినా, ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో అండర్ బ్రిడ్జిలో పూర్తిగా నీరు చేరిపోయింది. ఈ విషయాన్ని గమనించుకోకుండా శ్రీనివాసరావు రావటంతో అండర్ బ్రిడ్జిలో ఉన్న నీటిలో పడి మృతి చెందాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

కరకట్టను తాకుతూ కృష్ణమ్మ

- పెరుగుతున్న వరదతో భయాందోళనలో కరకట్ట సమీప గ్రామస్తులు
- 11 లక్షల 40 వేల క్యూసెక్కులు దాటిన వరదనీరు
- ముంపు భయంలో కరకట్ట పరిసర గ్రామాలు



దుగ్గిరాల: పెదకొండూరువద్ద కరకట్టను తాకుతూ ప్రవహిస్తున్న వరదనీరు



దుగ్గిరాల: గొడవర్రు వద్ద పసుపు, కూరగాయ తోటలను చుట్టుముట్టిన వరదనీరు



గొడవర్రు వద్ద కోతకు గురయ్యేచోట నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకటరవి, సిబ్బంది

దుగ్గిరాల, సెప్టెంబరు 2: అంతకంతకూ పెరుగుతున్న వరద ఉధృతితో, కరకట్ట అంచు గ్రామాలు వణికిపోతున్నాయి. ఎటుచూసినా వరద నీరు చుట్టుముట్టడంతో ఏటి ఒడ్డుకు చేరి కృష్ణమ్మా శాంతించ మంటూ ప్రజలు వేడుకుంటున్నారు. మునుపెన్నడూ లేని విధంగా 120 ఏళ్ల తర్వాత 11లక్షల40వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వస్తుండటంతో ముంపు భయం లంకగ్రామాలను వెంటాడుతోంది. మండలంలోని కరకట్ట అంచున వున్న కృష్ణాతీర గ్రామాలు వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామస్తులు ముంపుభయంతో వణికిపోతున్నాయి. పెదకొండూరులోని కరకట్ట లోపలివైపున వున్న వందలాది ఎకరాల వాణిజ్యపంటలు పసుపు, అరటి, కంద, చేమ, బొప్పాయి తోటలు వరద నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. పెదకొండూరులోని పురాతనా ఆలయాలు శ్రీరాజేశ్వరస్వామి, శ్రీఆనందేశ్వర స్వామి, శ్రీజనార్ధనస్వామిఆలయాలు, శ్రీకనకపుట్టలమ్మ తల్లి ఆలయం మునిగిపోయాయి. హిందూ, క్రైస్తవ శ్మశాన వాటికలు పూర్తిగా మునిగిపోయాయి. గొడవర్రు, అత్తలూరి పాలెం మధ్య కరకట్ట బలహీనమై కోతకు గురవుతున్న రెండుచోట్ల ఇసుకబస్తాలతో అడ్డుకట్టవేయడమే కాకుండా, కంకర ఇసుక కలిపి కట్టగా పోసి కరకట్టను బలోపేతం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పెదకొండూరులో వరదలో కొన్ని పశువులు చిక్కుకు పోయాయని చెబుతుండగా వాటిని కాపాడి ఒడ్డుకు చేర్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కరకట్ట లోపలివైపున సైతం వర్షపునీటితో పొలాలన్నీ నిండిపోయాయి. కూరగాయ పంటలు, పసుపుతోటలు నీటిలో నానుతున్నాయి. పెదకొండూరు, గొడవర్రుల వద్ద వరద పరిస్థితిని, కోతకు గురైన వైనాన్ని కరకట్టను పరిశీలించేందుకు వచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్, తెనాలి సబ్‌కలెక్టర్ సంధ్యాసిన్హా దృష్టికి స్థానిక టిడిపి నాయకులు తీసుకెళ్లారు. ముందస్తు జాగ్రత్త ప్రకృతివిపత్తుల నివారణశాఖ వాహ నాన్ని కరకట్టపై సిద్ధం చేసి ఉంచారు.

21మంది క్యాజువల్ లేబర్ ఉద్యోగుల తొలగింపు

పెదకాకాని, సెప్టెంబరు 2: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 21మంది క్యాజువల్ లేబర్ ఉద్యోగులను తొలగిస్తూ విశ్వ విద్యాలయం ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఐదేళ్ల పాలనాకాలంలోను మారు 150మందికి పైగా క్యాజువల్ లేబర్ ఉద్యోగులను నియ మించారు. పరిపాలన కార్యాలయాలు, విభాగాలు, పూలే అధ్యయన కేంద్రంతోపాటు ఇతర విభాగాల్లో పెద్దఎత్తున వీరి నియామకాలు జరిగాయి. వీరిలో గత వీసీ అనుచరులుగా పనిచేసినవారికి నెలకి రూ.25వేలు, రూ.22వేలు వేతనంగా నిర్ణయించి అప్పనంగా వేతనాలు ఇచ్చారు. వీరి నియామకంలో గత వైసీపీ ప్రభుత్వం పెద్దల సిఫార్సులతోపాటు విశ్వవిద్యాలయంలోని పలువురు నాయకులు, ఉద్యోగుల పైరవీలు ఉన్నట్లు సమాచారం. వీరి నియామకంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వర్సిటీలో కొత్తగా ఉన్నతాధికారులు పదవీ బాధ్యతలు చేపట్టారు. వెంటనే నూతన ఉన్నతాధికారులు గత వీసీ హయాంలో జరిగిన క్యాజువల్ లేబర్ ఉద్యోగుల నియామకంపై దృష్టి సారించారు. వీరి నియామకంలో అక్రమాలు జరగడంతోపాటు వేతనాలపరంగా వర్సిటీకి భారంగా ఉందనే నిర్ణయానికి వచ్చి వీరి తొలగింపుపై నిర్ణయం తీసుకున్నారు. వర్సిటీలో పనిచేస్తున్న క్యాజువల్ లేబర్ ఉద్యోగులందరినీ పలు విడతల వారీగా తొలగించాలని వారు నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి మాజీ వీసీ రాజీనామా చేసిన ఈ ఏడాది జులై ఒకటో తేదీ లోపు తీసుకున్న 21మంది క్యాజువల్ లేబర్ ఉద్యోగులను తొలగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ నిర్ణయం విశ్వవిద్యాలయంలో చర్చనీయాంశంగా మారింది.

మిర్చియార్డుకు ఏ క్షణాన్నైనా విజిలెన్స్

- డీజీకి అందిన ఫిర్యాదుపై విచారణకు ఆదేశం
- ఫైళ్లన్నింటినీ స్వాధీనం చేసుకోనున్న అధికారులు
- ఇందుకోసం సీఐ శ్రీహరికి ప్రత్యేక బాధ్యతలు

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు ఏ క్షణాన్నైనా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలకు వచ్చే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వహయాంలో జరిగిన కుంభకోణాలపై విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌కు అందిన ఫిర్యాదుపై విచారణ జరపాల్సిందిగా డీజీ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో ఇక్కడి అధికారులు అందుకు సన్నద్ధమయ్యారు. ఆరోపణలకు సంబంధించిన ఫైళ్లను స్వాధీనం చేసుకొనే బాధ్యతని ప్రత్యేకించి ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారికి కేటాయించారు. ఒకదశలో సోమవారమే విజిలెన్స్ అధికారులు మిర్చియార్డుకు వస్తారన్న ప్రచారం జరిగింది. అయితే ఏవో అనివార్య కారణాలతో సోదాలను మంగళవారానికి వాయిదా వేసుకొన్నారు. దీంతో ఏమేమి కుంభకోణాలు బయటపడతాయోనన్న ఉత్కంఠ నెలకొంది. అలానే ఎవరెవరిపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేస్తుందోనన్న చర్చ కూడా జరుగుతున్నది.

మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు వారం క్రితం విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తాని కలిసి ఫిర్యాదు చేశారు. అలానే రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని కూడా కలిసి కంప్లయింట్ చేశారు. యార్డులో ఏటా రూ. 16 వేల కోట్ల మిర్చి అమ్మకాలు జరుగుతాయని, ఇందుకు 1 శాతం సెస్సు లెక్కిస్తే రూ. 160 కోట్లు ఏటా రావాల్సి ఉండగా కేవలం రూ. 80 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకే వస్తుందన్నారు. దీనికితోడు 5 శాతం జీఎస్‌టీ రావాల్సి ఉండగా ఐదేళ్లలో రూ. 4 వేల కోట్లకు బదులు రూ. 2 వేల కోట్లు మాత్రమే జమ అయిందన్నారు. యార్డులో జీరో బిజినెస్, రేట్ కటింగ్ వలన ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నదన్నారు. వైసీపీ హయాంలో కొంత మంది కమీషన్ వ్యాపారస్తులకు ఈ-కొనుగోలు యాప్ ద్వారా షాపులు కేటాయించారు. వాటికి ఎస్‌ఎఫ్‌టీ ద్వారా అద్దె నిర్ణయించారు. అద్దె ఎక్కువగా ఉందని వ్యాపారస్తులు విజ్ఞప్తి చేయగా భారీగానే ముడుపులు స్వీకరించి 50 శాతం అద్దె మినహాయించారని ఆరోపించారు.

2023లో కమీషన్ వ్యాపారస్తుల లైసెన్సులు సుమారు 400వరకు రెన్యూవల్ చేశారు. దీనికి ఒక్కొక్క వ్యాపారి నుంచి రూ.25వేలు మొదలుకొని రూ.50వేల వరకు వసూలుచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలానే యార్డులో సుమారు 180మంది కమీషన్ వ్యాపారస్తులకు సంబంధించిన పార్టనర్‌షిప్ డీడ్‌ని మార్పుచేసి లైసెన్సులు బదిలీ చేయడానికి రూ.లక్షకు పైగా వసూలుచేశారని పేర్కొన్నారు. యార్డుకు వస్తున్న సరుకుకు రికార్డులో నమోదవుతున్న దానికి సంబంధం లేకుండా ఉందన్నారు. మార్కెట్ యార్డు సీజన్‌లో వ్యాపారస్తులకు అదనపు ప్లాట్లు కేటాయించి అద్దెతో పాటు ఫీజు టూ ఫీజు వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. కల్తీ కారం యథేచ్ఛగా విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సిఫార్సుతో కొంతమందికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించారని, వారు ఆఫీసుకు రాకుండా జీతాలు తీసుకొంటున్నారని చెప్పారు. వైసీపీ హయాంలో రైతులకు రూ. 100 కోట్ల మేరకు వ్యాపారస్తులు ఎగ్గొట్టారన్నారు. 2019 జూన్, జూలై, ఆగస్టు నెలల్లో అయితే రూ.15 వేల కోట్ల విలువ చేసే మిర్చి క్రయవిక్రయాలు అక్రమంగా జరిగాయన్నారు. వీటన్నింటిపై విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, మన్నవ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇప్పుడు విజిలెన్స్ విచారణకు సిద్ధమైంది.



గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


ప్రగతి రథచక్రాలు ఆగకూడదు : ఎమ్మెల్యే నసీర్


ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ ప్రగతి రథచక్రాలు ఎప్పుడూ ఆగకూడదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహమ్మద్ అన్నారు. ఇటీవల కురిసిన కాల భారీ వర్షాలకు నీట మునిగిన ఎన్టీఆర్ బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. బస్టాండ్‌లో ఉన్న నీటిని బయటకు పంపేందుకు ఒక్క మోటార్‌నే ఏర్పాటు చేయడాన్ని గమనించి మరో మూడు నాలుగు మోటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్సులు రోడ్లపైనే ఉంచడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ట్రాఫిక్ సమస్యను నివారించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాబోయే రోజుల్లో బస్టాండును ఆధునికంగా, హైటెక్ బస్టాండుగా తీర్చిదిద్దడానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పరిశీలనలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్, ఆర్టీసీ డిపో-1 మేనేజర్ సలీం, జాగర్లమూడి శ్రీనివాస్, మహంకాళి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

ప్రజల ఫిర్యాదులపై శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 2 : గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజల అర్జీలను క్షేత్ర స్థాయి అధికారులు నేరుగా పరిశీలించాలని, ఆయా సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పిజిఆర్ఎస్‌కు సకాలంలో హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, వెంకట లక్ష్మీ, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాం సుందర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్, ఉపా సెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, డి.సి.పి.లు, ఈఈలు, ఆర్ఓలు, ఎస్.ఎస్.లు పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగింపునకు స్పెషల్ డ్రైవ్

స్పెషల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణల తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఏసీపీ అజయ్ కుమార్, టీపీఎస్ సువర్ణ కుమార్‌లు అక్రమ ఆక్రమణ దళంతో సోమవారం జీటి రోడ్, శ్రీనివాసరావు తోట ప్రాంతాల్లో డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ వివిధ వ్యాపారాల నిమిత్తం ప్రధాన డ్రెయిన్లపై ఆక్రమణలు చేసుకోవద్దని ప్రజలకు సూచించారు.

విజయవాడ ముంపు బాధితులకు జీఎంసీ అండ

భారీ వర్షాలకు అతలాకుతలం అవుతున్న విజయవాడ నగర ప్రజలకు అండగా గుంటూరు నగరపాల సంస్థ నిలుస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, సంచాలకులు హరి నారాయణమురగన్ ఆదేశాల మేరకు విజయవాడ నగరంలోని ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు జీఎంసీ తరఫున లక్ష పాల ప్యాకెట్లు, లక్ష బిస్కెట్ ప్యాకెట్లు, 30 వేల వాటర్ బాటిళ్లు , 900 బ్రెడ్ ప్యాకెట్లని గత రాత్రి ప్రత్యేక వాహనం ద్వారా విజయవాడ పంపించినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

వరద బాధితులకు ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ చేయూత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 2: విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాలలో నివసిస్తున్న బాధితులకు ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్, ఏపీ కాటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దాదాపు 5 వేల ఆహార ప్యాకె ట్లు, వాటర్ బాటిల్స్‌ను పంపారు. కార్యక్రమంలో ఏపీ మిల్స్ అసోసియేషన్ చైర్మన్ పి.కోటిరావు, గౌరవ చైర్మన్ ఎల్. రఘురామిరెడ్డి, ఉపాధ్యక్షులు పి.చలపతిరావు, ఎస్. కోటేశ్వరరావు, ఎమ్ వి సత్యనారాయణ, కమిటీ సభ్యులు డి.చంద్రశేకర్, టి.అంబరీష్, కార్యదర్శి కుమార్, కాటన్ అసోసియేషన్ కార్యదర్శి కె. రామారావు పాల్గొన్నారు.

వరద బాధితులకు కేజేఎస్ఎస్...

విజయవాడలో వరద బాధితులకు కమ్మ జన సేవా సమితి (కేజేఎస్ఎస్) అండగా నిలబడింది. సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు కేజేఎస్ఎస్ దాదాపు 1500 ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు విజయవాడకు పంపారు. సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు, కేజేఎస్ఎస్ కార్యదర్శి చుక్కపల్లి రమేష్, సభ్యులు మర్రిపూడి సీతారామయ్య, వడ్లమూడి శివరామకృష్ణయ్య రాయపాటి గోపాలకృష్ణ, ఘంటా పున్నారావు, పెద్ది సాంబశివరావు, కె.బుచ్చయ్య, మైనేని సీతారామయ్య పాల్గొన్నారు.

బాధితులకు భరోసా కల్పించాం

● కరకట్టకు గండ్లు పడకుండా నిరంతర నిఘా
● పునరావాస కేంద్రాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు
● కమాండ్ కంట్రోల్ రూమ్‌ని సందర్శించిన కలెక్టర్ నాగలక్ష్మి


కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంని సందర్శిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వలన ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టామని, బాధితులకు ప్రభుత్వం అండగా వుంటుం దని భరోసా కల్పించామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమ వారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆగస్టు 31వ తేదీ ఉదయం 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు కురిసిన వర్షానికి కృష్ణా నదికి 11.43 లక్షల క్యూసెక్కుల నీరు రావడం జరిగిందన్నారు. తాడికొండ నియోజకవర్గంలోని మహానాడు ఏరియాలో 2 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, తాడేపల్లిలో మొత్తం 4 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, దుగ్గిరాల, పెదకొండూరులోని లోతట్టు ప్రాంతాల్లో, తుళ్ళూరు మండలంలోని ఉద్దండరాయునిపాలెం లంకలోని ప్రజలను ఆదివారం రాత్రి పునరావాసకేంద్రాలకు, పెద్దలంకలోని ప్రజలను ఇబ్రహీంపట్నం, విజయవాడ వైపునకు తరలించామని, పెదలంకలో మిగిలిన 40 మందిని సోమవారం హెలికాప్టర్ ద్వారా రక్షించినట్లు వివరించారు.

నేడు కూడా స్కూళ్లు, కాలేజీలకు సెలవు

వరదలు, విద్యా సంస్థల్లో నిలిచిన వర్షం నీరు కారణంగా ఈ నెల 3వ తేదీ మంగళవారం కూడా జిల్లా వ్యాప్తంగా అన్ని స్కూళ్లు, కళాశాలలు, అంగన్‌వాడి కేంద్రాలకు సెలవుదినం ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు ప్రైవేటు మేనేజ్‌మెంట్ సంస్థలు కూడా మూసి వేయాలని ఆదేశించారు.

లంక గ్రామాల్లో ఎస్పీ విస్తృత పర్యటన

గుంటూరు, సెప్టెంబరు 2 : డెల్టాలోని కొల్లిపర పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న అత్తలూరివారిపాలెం, పాతబొమ్మువానిపాలెం, పిడమర్తిపాలెం, ఆ చుట్టుపక్కల వరద ముంపునకు గురైన లంక గ్రామాల్లో ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. ప్రజలు అధైర్య పడవ ద్దని, సహాయ సహకారాలు అందించడానికి పోలీస్ శాఖ సిద్ధంగా అందుబాటులో ఉందని ముంపు ప్రాంత ప్రజలకు ఎస్పీ తెలిపారు. ప్రజలను త్వరితగతిన పునరావాస కేంద్రాలకు తరలించాలని, ముంపు ప్రాంతాల్లోని బాధితులకు ఆహారం, మంచినీరు అందించాలని పోలీస్ సిబ్బందిని, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఆదేశించారు. కార్యక్రమంలో తెనాలి రూరల్ సిఐ బెల్లం శ్రీనివాస రావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఆళహరి శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు, వీఆర్వో ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.


లంక గ్రామాల్లో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

దేశ ఆర్థిక భద్రతలో ఎల్ఐసీది సుస్థిరస్థానం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 2: జాతీయాకరణ నాటి నుంచి ప్రగతి పథంలో నడుస్తూ గత 68 సంవత్సరాలుగా సేవలందిస్తూ దేశ ఆర్థిక భద్రతలో ఎల్ఐసీ సుస్థిర స్థానం సాధించిందని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు అన్నారు. ఎల్ఐసీ 68వ వ్యవస్థాపక ఉత్సవాల సందర్భంగా స్థానిక అరండల్‌పేట 4వ లైన్ ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి రఫీ బ్రాంచి మేనేజర్ (సేల్స్) ఆర్‌వి. సుబ్బారావు, పివి రమణ, వివికే సురేష్, ఆర్ వి ఎస్ శ్రీనివాస్, ఎన్ విజయ కుమార్, ఎన్ విజయలక్ష్మి, పి శ్రీదేవి, కె లలిత తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ హర్షణీయం

గుంటూరు(విద్య), సెప్టెంబరు 2 : నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థినీ, విద్యార్థులకు జర్మన్ స్కాలర్‌షిప్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. స్థానిక గోరంట్లలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో ఫాదర్ బాలశౌరయ్య, విశ్రాంత డీజీపీ కెఆర్ఎం కిషోర్‌కుమార్ చేతుల మీదుగా మొత్తం 150 మందికి రూ.10 లక్షలు అందజేశారు. ఫాదర్ కనపాల కిరణ్ సహకారంతో ఈ మొత్తాన్ని అందజేశారు. గుంటూరు పీఠాధిపతులు ఫాదర్ జోసెఫ్ కిరణ్, ఫాదర్ చిన్నయ్య, ఏసి కళాశాల తెలుగు విభాగాధిపతి ,వైస్ ప్రిన్సిపల్ కనపాల జోసెఫ్ పాల్గొన్నారు.

అంతర జిల్లాల దొంగ అరెస్టు

● రూ.8 లక్షల సొత్తు స్వాధీనం

గుంటూరు, సెప్టెంబరు 2: వివిధ జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడుతోన్న అంతర రాష్ట్ర దొంగను మంగళగిరి రూరల్, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం గౌరవరం గ్రామానికి చెందిన తోట శివకుమార్ అలియాస్ శివభవానిని అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.8 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీసీఎస్ అధికారులు వివరాలు వెల్లడించారు. ఇటీవల మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రబాలెం గ్రామంలో మూడు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో సీసీఎస్ పోలీసులు ఆయా చోరీలకు పాల్పడింది శివకుమార్‌గా గుర్తించి అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.8 లక్షల ఖరీదైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా విజయనగరం రూరల్, వైజాగ్‌లో భీమిలి, విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. ఆయా జిల్లాల్లో జరిగిన ఈ మూడు కేసుల్లో రూ.2 లక్షల 83 వేల ఖరీదైన సొత్తు రికవరీ చేయాల్సి ఉందని తెలిపారు. నిందితుడి మీద విజయవాడ సిటీ, మచిలీపట్నం, రాజమహేంద్రవరం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, తుని, అనకాపల్లి, విజయనగరం రూరల్‌లో సుమారు 151 పైగా కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ చూపిన క్రైమ్స్ అదనపు ఎస్పీ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీసీఎస్ డీఎస్పీ ఎ.శివాజీ రాజు పర్యవేక్షణలో, సీసీఎస్ సీఐ డి.వెంకన్న చౌదరి, మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్లు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుళ్లు ఎండీ జాని, కె.ప్రసాద్, జి.మల్లేశ్వరరావు, ఎండి గౌస్‌బాషా, కానిస్టేబుల్ ఎండి షబీర్, మంగళగిరి రూరల్ ఏఎస్సై షేక్ సుభాని, సీహెచ్ రవి కుమార్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

సీఎం చంద్రబాబును ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకోవాలి : జడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 2 : పెద్ద వయసులో ఉండి కూడా వరద బాధితులకు ఆపన్న హస్తం అందించేందుకు అహర్నిశలు శ్రమ పడుతున్న సీఎం చంద్రబాబుని ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు వరద సహాయక చర్యల్లో పాల్గొనాలన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ముగ్గురు అరెస్టు

గుంటూరు, సెప్టెంబరు 2 : స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టాల్ గర్ల్స్ హైస్కూల్లో అద్దె ప్రాతిపదికన నడుస్తున్న బీసీ బాలికల వసతి గృహంలో బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు కిరణ్ కుమార్, కార్తీక్‌తోపాటు లక్ష్మిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో నిందితులను జిల్లా జైలుకు తరలించినట్లు నగరంపాలెం సీఐ మధుసూదనరావు చెప్పారు.

ప్రజా సంక్షేమమే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ధ్యేయం

● వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్


అన్నదానం ప్రారంభిస్తున్న వేద సీడ్స్ ఈడీ తులసీ ధర్మచరణ్

గుంటూరు, సెప్టెంబరు 2: ప్రజా సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ధ్యేయమని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. సోమవారం స్థానిక అరండల్‌పేట 11/3లోని వేద సీడ్స్ కార్యాలయంలో పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా పి.చంద్రశేఖర్‌తో కలసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి.. పవన్ కల్యాణ్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో పవన్ తనదైన శైలిలో దూసు కుపోతున్నారని అన్నారు. రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ప్రభుత్వం, జనసైనికులు అండగా ఉండి వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి ఆదుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. స్థానిక అమరావతి రోడ్ లోని సత్రంలో గుళ్ళపల్లి కుమార్, కోటగిరి అనిల్, ప్రదీప్ ఆధ్వర్యంలో పవన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. వృద్ధులకు, చిన్నారులకు పండ్లను పంపిణీ చేసి స్థానికులకు అన్నదానం ఏర్పాటు చేశారు. తులసి ధర్మచరణ్ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో తోట రంగారావు, పత్సమట్ల ఉదయ్ రాజ్, తేలప్రోలు వెంకట్రావు, గాజుల సాయిరాం, కొట్టు రవి, వల్లెపు శ్రీను, సిరిగిరి గణేష్ సాయి, రవి, వినోద్, హుస్సేన్, విజయ్ పాల్గొన్నారు.

కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 2: ఉపముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక అమరావతి రోడ్‌లోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సేవా సదర్ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల గోపికుమార్, మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో థలసీమియా నీడ్స్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఈ మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగాహాజరైన తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. తొలుత భారీ బర్త్ డే కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి పవన్‌కల్యాణ్ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, టీడీపీ నేతలు డాక్టర్ నిమ్మల శేషయ్య మద్దిరాల మ్యానీ, యర్రగోపు నాగేశ్వరరావు, అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, కావూరి విజయ్‌చంద్, జనసేన నేతలు నారదాసు ప్రసాద్, అడపా మాణిక్యాలరావు, బీజేపీనాయకులు వైవీ సుబ్బారావు, ఎంఈ రమణమూర్తి, డేగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మెగా అభిమానులు, జనసైనికులు కేకులు కట్ చేసి పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి వేడుకలు జరిపారు. నెహ్రూనగర్, శివరాంనగర్, ఆనంద్‌పేటలో అన్నదానం నిర్వహించారు. నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో జనసేన కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ, జనసేన నేతలు ఆళ్ల హరి, మేకల రవీంద్ర, మామిడి రామారావు, చెన్నంశెట్టి శివ, చింతారాజు తదితరులు పాల్గొన్నారు.

●గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టనరోజు సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. అనంతరం గుంటూరు ప్రభుత్వాస్పత్రి దగ్గర పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నారదాసు రామచంద్రప్రసాద్, చెమిడికంటి కిరణ్, కొమాండూరి నరేంద్రకుమార్, ఉగ్గిరాల రాజా, చందనపు నాగరాజు, సిరిగిరి రమణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● సాయి సిరి కన్‌స్ట్రక్షన్స్ అధినేత చెన్నంశెట్టి శివ ఆధ్వర్యంలో గోరంట్లలోని ఏబీసీ వాటర్ వ్యూ అపార్టుమెంటులో పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. 30వ డివిజన్ జనసేన అధ్యక్షుడు దాసరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 28వ డివిజన్‌లో మామిడి రామారావు నేతృత్వంలో అన్నదానం నిర్వహించారు. 24వ డివిజన్‌లో కూడా అన్నదానం చేశారు.

● పెదపలకలూరులో జనసేన పార్టీ నాయకులు స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన ప్రత్తిపాడు సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరావు మాట్లాడారు.

కృష్ణానది వరద ఉధృతిని పరిశీలించిన ఐజీ

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 2: ప్రకా శం బ్యారేజీ దిగు వన కృష్ణానది వరద ఉధృ తిని గుంటూరు రేంజి ఐజీ సోమవారం రాత్రి పరిశీలించారు. సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముంపునకు గురైన మహానాడుకు వెళ్లే మార్గంలో జలమయమైన రహదారిని పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన వెంట నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, సిబ్బంది ఉన్నారు.


శాశ్వత పరిష్కారం చూపిస్తాం : డీఆర్ఎం

తాడికొండ, సెప్టెంబరు 2: కంతేరు రైల్వే అండర్ బ్రిడ్జిలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని గుంటూరు రైల్వే డివిజనల్ అధికారి ఎం రామకృష్ణ పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కంతేరు రైల్వే అండర్ బ్రిడ్జి వర్షం నీటితో పూర్తిగా మునిగిపోవటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో సోమవారం తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి జయరామయ్య, రైల్వే అధికారులతో కలిసి రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించారు. ఈసందర్భంగా డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు చర్చించి ఏవిధంగా అయితే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రాకపోకలు సాగేవిధంగా బ్రిడ్జి మార్పులు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాజధానికి ముఖద్వారంగా ఉన్న కంతేరు గ్రామంలోకి వెళ్లటానికి ఉపయోగకంగా ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని రైల్వే అధికారులు శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజనీర్ జేఈ అనూష, టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకుంటాం

● చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత

మంగళగిరి, సెప్టెంబరు 2: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన చేనేత కార్మికులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కే.సునీత చెప్పారు. మంగళగిరి మండలం ఎర్రబాలెంలోని చేనేత వాడల్లో సోమవారం ఆమె జౌళి శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. నీళ్లు చేరిన చేనేత మగ్గాలను, నేత కార్మికుల నివాసాలను పరిశీలించారు. సహకార సంఘాలను సందర్శించి నేత కార్మికుల జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. చేనేత కార్మికులకు జరిగిన నష్టాన్ని పరిశీలించ ప్రభుత్వానికి నివేదిక పంపుతామని, నేత కార్మికులను తగిన విధంగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జౌళి శాఖ కమిషనర్ జీ.రేఖారాణి, అదనపు సంచాలకులు కే.శ్రీకాంత్ ప్రభాకర్, సంయుక్త సంచాలకులు కన్నబాబు, సహాయ సంచాలకులు వనజ పాల్గొన్నారు.


వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలో మంచి నీటి చెరువుకట్ట గండి పూడ్చుతున్న ఉప్పుటూరి చిన రాములు, గుంటుపల్లి రామకృష్ణ

మేడికొండూరు తహసీల్దార్‌గా కళ్యాణి

మేడికొండూరు సెప్టెంబరు 2: మేడికొండూరు నూతన తహసీల్దార్‌గా కే కళ్యాణి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన పద్మనాభుడు ఈ31వ తేదీని పదవీ విరమణ చేశారు. గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో డిఏటగా పనిచేస్తున్న కళ్యాణిని మేడికొండూరుకు ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా నియమించారు. ఆమె గతంలో మేడికొండూరులో ఆర్ఐ పనిచేసిన అనుభవం ఉంది. పదవీ బాధ్యతలు చేపట్టిన కళ్యాణిని ఇక్కడ పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన తహసీల్దార్ పద్మనాభుడు బాధ్యతలు అప్పగించి అభినందనలు తెలిపారు.

తాడికొండ - కంతేరుకు రాకపోకలు బంద్

● మూడు అడుగుల మేర గుంతలు పడ్డ రోడ్డు
● ఎర్రవాగు నీటిలో నానుతున్న మినుము, జూట్ పంటలు
● వరద నీటిలోనే వరి పొలాలు ● ఆందోళనలో అన్నదాతలు


తాడికొండ, సెప్టెంబరు 2: రెండు క్రితం కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లోని ప్రజలు, పంటలు నష్టపోయిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అవ్వటంతో పాటు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాడికొండ మండలం కొండవీటివాగు, ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించటంతో జనజీవనం స్తంభించింది. తాడికొండ-కంతేరు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అంతేకాకుండా కంతేరు ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా అడ్డరోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన రైల్వే బ్రిడ్జి పూర్తిగా నీటిలో మునిగిపోయింది. దీంతో రెండు రోజుల నుంచి నేషనల్ హైవే నుంచి కంతేరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రవాగు సమీపంలోని సుమారు అర కిలోమీటరు రోడ్డు కొట్టుకుపోవటంతో పాటు, మూడు అడుగుల మేర గుంతలు పడ్డాయి. రోడ్డు కోతకు గురైంది.


కాకుమాను, సెప్టెంబరు 2: శనివారం కురిసిన భారీ వర్షానికి మండలంలో వరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రెండు రోజుల నుంచి వరి పొలాల్లో నీరు బయటకు వెళ్లకపోవడంతో పంట దక్కదేమో అని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మండలపరిధిలోని వల్లూరు, లింగంగుంట పాలెం, కొల్లిమర్ల, చిన్నలింగాయాపాలెం, కొండబాలవారిపాలెం, బీకే పాలెం, తెలగాయ పాలెం, గరికపాడు, బోడిపాలెం, రేటూరు, అప్పాపురం, కాకుమాను గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు వరిని సాగు చేశారు. నల్లమడ, నక్కవాగు, ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాకుమాను శివారులో లోలెవల్ చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది.


తాడికొండలో నీట మునిగిన మినుము పంట

తాడేపల్లి మండలంలో వరద ఉధృతి

తాడేపల్లి, సెప్టెంబరు 2: మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంత గ్రామాల వద్ద కరకట్ట వద్దకు కృష్ణానది వరద చేరుకోవడంతో ప్రజలు భయంభయంగా కాలం వెల్లదీస్తున్నారు. చిర్రావూరు వద్ద నది మధ్యలో ఉన్న లంకల్లో చిక్కుకొని ఉన్న పలు గేదెలను బోట్లు, పడవల ద్వారా స్థానిక టీడీపీ, జనసేన నేతలు, అధికారులు బయటకు తరలించారు. చిర్రావూరు కరకట్ట వద్ద కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. కరకట్ట సమీపంలోని పంట పొలాలన్నీ నీటమునిగాయి. గుండిమెడ ప్రాతూరు ప్రాంతంలో కరకట్ట తీర ప్రాంతం వరదనీటితో నిండిపోయింది. పెనుమాక - ఉండవల్లి మధ్య ఉండవల్లి గుహాలయాల వరకు వరదనీరు రహదారిపైకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్లలోకి వరద నీరు రాకుండా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేయడం వరదనీటిని మోటార్ల ద్వారా టిడిపి, జనసేన నేతలు బయటకు తరలించే ఏర్పాట్లు చేశారు.


పెనుమాక-ఉండవల్లి మార్గంలో వరదనీటి ఉధృతి


కాకుమాను మండలం రేటూరులో వరద నీటిలో వరి పొలాలు

ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

గుంటూరు, సెప్టెంబరు 2: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు విద్యానగర్‌లోని ప్రత్తిపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గుంటూరు రూరల్ మండల జనసేన అధ్యక్షుడు గంధం సురేష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొని కేక్ కట్ చేసి, పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, ఇమ్మడి మల్లికార్జున రావు, గంగాధర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, సెప్టెంబరు 2: పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు ఆయన జన్మదిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం భవాని వాసు కాంప్లెక్స్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు నిమ్మకాయల సాంబశివరావు, మండల పార్టీ అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, రామ్మోహన్, కుర్రి సుబ్బారెడ్డి, కాకాని సురేష్, పమిడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పాలేటి సాంబశివరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

● కాకుమాను, సెప్టెంబరు 2: మండల వ్యాప్తంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

మహానాడును పరిశీలించిన కలెక్టర్


ముంపు బాధితులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 2: ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణా నది వరద నీటి ముంపునకు గురైన మహానాడు ప్రాంతాన్ని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలిసి సోమవారం పరిశీలించారు. ముంపునకు గురైన కుటుంబాలకు అందిస్తున్న సహాయ కార్యక్రమాలు, పునరావాస కేంద్రాల గురించి ప్రత్యేక అధికారి, జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్థానికులతో మాట్లాడుతూ కృష్ణా నదికి వరద నీరు పెరిగే అవకాశం వున్నందున కాలనీలో లోతట్టు ప్రాంతాల వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. వరద నీటి ముంపుకు తగ్గే వరకు నివాసితులకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు.

లోతట్టు ప్రాంతాల బాధితులకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 2: లోతట్టు ప్రాంతాల్లోని బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు హామీ ఇచ్చారు. అకాల వర్షాల కారణంగా నీట మునిగి ఇబ్బందులు పడుతున్న 46, 48 డివిజన్ పరిధిలోని ద్వారకనగర్, రెడ్డిపాలెం ప్రజలను ఆయన పరామర్శించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిత్యావసర సరులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిరాల మ్యానీ, కల్లూరి శ్రీనివాసరావు, కార్పొరేటర్ నూకవరపు బాలాజీ, స్థానికులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట మార్గాన్ని పరిశీలించిన శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, సెప్టెంబరు 2: ఆపద వస్తే ప్రజలు ఏమైపోతే మాకేంటి అని నాలుగు గోడ మధ్య కూర్చునే వైసీపీ ప్రభుత్వం లాంటి ప్రభుత్వం తమది కాదని.. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వం అని తాడకొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు కృష్ణానది వరద ఉధృతిని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మితో కలసి ఆయన పర్యవేక్షించారు. లంకవాసులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాటు చేశారు. పెదలంకలో బయటకు రాము.. అని భీష్మించుకూర్చున్న 20 మందిని హెలీకాప్టర్‌లో బయటకు తీసుకొచ్చి పునరావాస కేంద్రానికి తరలించారు. సోమవారం సాయంత్ర ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ట్రాక్టర్ ఎక్కి బోరుపాలెం నుంచి రాయపూడి వరకు కరకట్ట మార్గాన్ని పరిశీలించారు. వెంకటపాలెం మంతెన ఆశ్రమం వద్ద కరకట్ట కింద లీక్ ఏర్పడటంతో తెల్లవారుజాము వరకు ఇసుక కట్టలు వేసి అదుపు చేశారు.

బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 2: బీసీ వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమం సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ అరాచక, విధ్వంసకర పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, నేతలు ఉప్పాల రాజ్‌కిరణ్, కొల్లూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
8
నవ్య
డాక్టర్
మంగళవారం • 3 సెప్టెంబరు 2024





కిడ్స్ డైట్

అమ్మ చేతి గోరుముద్ద!

పిల్లలు తినడానికి మొండికేస్తారు. అయిష్టత ప్రదర్శిస్తారు. బలవంతం చేస్తే ఏడ్చేస్తారు. అలాగని వదిలేస్తే పిల్లలకు పోషకాలు అందేదెలా? ఇలాంటప్పుడు పిల్లలకు బలవర్ధక ఆహారం మీద ఇష్టం పెరిగే చిట్కాలు పాటించాలి!

పిల్లల పోషకాహారం గురించిన అవగాహన తల్లుల్లో పెరగడం అభినందనీయమే! అయితే ఆ ఆహారంలో విటమిన్లు, ఖనిజలవణాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు ఉండేలా సరి చూసుకోవడమూ అవసరమే! అయితే అవన్నీ ప్రాంతీయపరమైన, సంప్రదాయపూరితమైన, రుతుపరమైన ఆహార పదార్థాలేనా? మనం తినే ఆహారం, నివసించే వాతావరణాలతో మన అనుబంధం కాలక్రమేణా బలహీనపడుతోంది. ఇప్పటికి పదేళ్ల వెనక్కు వెళ్తే ఏ ఇంట్లో చూసినా పప్పు, అన్నంతో కూడిన భోజనమే తినేవాళ్లం. పిల్లలూ వాటినే ఇష్టంగా తినేవాళ్లు. కానీ ఇప్పుడు పోషకాల మీద పెరిగిన అవగాహన మూలంగా, పిండిపదార్థాలు, కొవ్వులను దూరం పెట్టేస్తున్నాం. ఏం కొంటున్నా, లేబుల్ పరీక్షించి, కేలరీలు లెక్కిస్తున్నాం. కానీ ఇలాంటి విపరీతమైన అప్రమత్తత వల్ల ఎక్కువ సందర్భాల్లో విలువైన పోషకాలకు దూరమవుతున్నాం. ఫిట్‌గా ఉండడానికి బదులు లావుగా తయారవుతున్నాం, తేలికగా జబ్బుల బారిన పడుతున్నాం. పోషకాలను బట్టి ఆహారాన్ని ఎంచుకునే ధోరణి వల్ల లాభపడేది ఆహార సంస్థలే! ప్రజల ఆరోగ్యానికి ఈ ధోరణి ఏమాత్రం ప్రయోజనకారి కాదు. కాబట్టి మరీ ముఖ్యంగా పిల్లలకు ఇచ్చే ఆహారం విషయంలో అమ్మమ్మల నాటి పాతవి, ఆరోగ్యకరమైన పద్ధతులనే ఎంచుకోవాలి.

అమ్మమ్మల ఆహారం!

ప్రపంచం మొత్తంలో స్థూలకాయం కలిగిన పిల్లలున్న దేశంగా భారతదేశం రెండవ స్థానంలో ఉంది. అంతమాత్రాన మనం పిల్లలు, వారి ఆహారపుటలవాట్లను అశ్రద్ధ చేస్తున్నామని కాదు. నిజానికి వారి ఆహారం పట్ల మనం అవసరానికి మించిన శ్రద్ధ ప్రదర్శిస్తున్నాం. పోషకాలున్న ఆహారం అది ప్రాంతీయమైనది కాకపోయినా, వెతికి వెతికి తినిపిస్తున్నాం. కానీ మన అమ్మలు, అమ్మమ్మలు ఇలా చేయలేదు. ఏ రుతువులో కాచే కాయలను ఆ రుతువుల్లో తినిపించారు. పొట్టు తీయని ధాన్యాలు, పెరట్లో పండిన కూరగాయలు, పళ్లు అందించారు. అప్పట్లో వంటగది ఇంటి మధ్యలో ఉండేది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వంటింట్లోకి వెళ్లి ఆహారం అందుకుని తినేటందుకే ఈ ఏర్పాటు. పాలు, పెరుగు, కమ్మని వెన్న, నెయ్యి, జున్నులు ప్రతి ఇంట్లో తాజాగా, సిద్ధంగా ఉండేవి. సున్నుండలు, అరిసెలు లాంటి బలవర్ధకైన చిరుతిళ్లు డబ్బాల్లో నింపి ఉంచేవారు. సెనగపప్పు ఉండలు, వేరుశనగ చెక్కలు, బెల్లం జిలేబీలు...ఇవన్నీ రక్తవృద్ధిని పెంచే చిరుతిళ్లే! వీటిలో ఎటువంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రంగులూ ఉండవు. కానీ ఇలాంటి వంటలు వండే బదులు, పాశ్చాత్య ఆహార పద్ధతులను అనుసరిస్తూ మాంసకృత్తుల కోసం సోయా, అవకాడొల మీద, పీచు కోసం ఓట్స్ మీద ఆధారపడుతున్నాం! వీటికంటే మెరుగైన ప్రత్యామ్నాయ, సంప్రదాయ పదార్థాలు ఎన్నో ఉన్నాయి.

పేచీ పెట్టే పిల్లలతో ఇలా...

కొంతమంది పిల్లలు తినడానికి పేచీ పెడతారు. ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయల పట్ల అయిష్టత ప్రదర్శిస్తారు. ఇలాంటప్పుడు పిల్లలకు ఆ ఆహారం పట్ల ఆసక్తి ఏర్పరిచే ప్రయత్నంచేయాలి. ఇందుకోసం పాలకూరను పెరట్లోనే పెంచాలి. పూల తొట్లలో కొత్తిమీర, పుదీనా, ఆకుకూరల విత్తనాలు చల్లి పిల్లల చేత వాటికి నీళ్లు పోయిస్తూ ఉండాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎదిగే క్రమాన్ని పిల్లలు పరిశీలించేలా చేయాలి. అలాగే కూరగాయలు పండించే తోటలకు అరుదుగానైనా పిల్లలను తీసుకెళ్తూ ఉండాలి. పళ్లు, కూరగాయ మొక్కలను పిల్లలు గమనించేలా చేయాలి. ఇలా చేయడం వల్ల ఆ మొక్కల ఉత్పత్తుల పట్ల పిల్లలకు ఆసక్తి పెరుగుతుంది. వాటి వంటలను ఆస్వాదించాలనే కోరిక కూడా పెరుగుతుంది. ఆహారంతో అనుబంధం ఏర్పరచాలంటే పర్యావరణంతోనూ అనుబంధం ఏర్పరచాలి. పెద్దలు ఈ విషయంలో పిల్లలకు మార్గనిర్దేశకులుగా మారాలి. అలాగే బయట భోజనాలకు స్వస్థి చెప్పి, ఇంటి భోజనానికే పెద్దలు కట్టుబడి ఉండాలి. పిల్లలకూ ఆ అలవాటు నేర్పాలి. వంటింట్లో వంటపనిలో నిమగ్నమయ్యే తల్లులను చూసిన పిల్లలు కచ్చితంగా వంటగదిలో తయారయ్యే ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే కుటుంబసభ్యులందరూ నిర్దిష్ట సమయాల్లో కలిసి కూర్చుని భోజనం చేసే కట్టుబాటు అనుసరించాలి. ఆ సమయంలో టివి, సెల్‌ఫోన్ లాంటి వాటికి చోటు ఇవ్వకూడదు.

> **పిల్లల ఆహారం పసందుగా...**
>
> అన్నం, వేరుసెనగపప్పు, నెయ్యి, ఒక పండు, ఇంట్లో తయారైన లడ్డు... ఇదీ పిల్లలకు అనునిత్యం ఇవ్వవలసిన ఆహారం. వీటితోపాటు కూరగాయలు, ఇంట్లో వండిన ఎటువంటి ఆహారమైనా ఇవ్వవచ్చు. చిరుతిళ్లుగా గుప్పెడు వేరుసెనగపప్పులు, తాజా పండ్లు, అటుకుల ఉప్మా, గోధుమరొట్టె, బెల్లం ముక్క, ఇంట్లో తయారైన సున్నుండలు, లడ్లు... ఇలా పోషకభరితమైన చిరుతిళ్లను పిల్లలకు అలవాటు చేయాలి. 'ఫలానా పాఠం తప్పు లేకుండా రాసి చూపిస్తే, చాక్లెట్లు ఇప్పిస్తా!' లాంటి ఆశ పెట్టే పద్ధతులు మానేయాలి. చాక్లెట్లను వారానికి ఒకసారికే పరిమితం చేయాలి. గోధుమ బియ్యంలో పోషకాలు అధికం. అలాగని వాటిని వండి పెడితే పిల్లలు తినడానికి ఇష్టపడరు. కాబట్టి బియ్యంతోపాటు రెండు గరిటెల గోధుమ బియ్యం కలిపి వండి పెట్టవచ్చు. క్యారట్, క్యాప్సికమ్ లాంటి కూరగాయలను అందమైన ఆకారాల్లో కోసి, ఆకర్షణీయమైన అలంకరణతో వడ్డించి, పిల్లల్లో ఆసక్తినీ రేకెత్తించవచ్చు. వీలైనంత వరకూ భిన్నమైన పోషకాలు అందేలా మూడు, నాలుగు కూరగాయలను కలిపి వండవచ్చు. ఇలా పిల్లలకు నచ్చే, వారు మెచ్చే తరహాలోనే ఆహారం పట్ల వారికి ఇష్టాన్ని రెట్టింపు చేయవచ్చు.



పోషకాల చిరుతిళ్లు ఇవే!

పిల్లలకు జంతికలు, గవ్వలు లాంటి నిల్వ పిండిపదార్థాలనే చిరుతిళ్లుగా ఇవ్వవలసిన అవసరం లేదు. పచ్చి కూరగాయ ముక్కలకు ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా జోడించి సలాడ్‌గా అందించవచ్చు. మొలకెత్తిన పెసలు, సెనగలు ఒక టీస్పూన్ నూనెలో వేయించి, క్రంచీగా ఉండడం కోసం వేయించిన వేరుసెనగ పప్పులు చల్లి, నిమ్మరసం కలిపి అందించవచ్చు. షియా విత్తనాలు నానబెట్టి, పండ్ల ముక్కలు, తేనె కలిపి తినిపించవచ్చు. కీర దోస లేదా జుకినిలను పొడవుగా తరిగి, ఉప్పు, చిల్లీఫ్లేక్స్, మొక్కజొన్న పిండి కలిపిన మిశ్రమంలో ముంచి, బ్రెడ్ పొడి అద్ది నూనెలో వేయించి అందించవచ్చు. కూరగాయలు కలిపి ఆమ్లెట్ వేసి ఇవ్వొచ్చు. పులిసిన పిండితో రొట్టెలు, చద్ది అన్నంతో దద్దోజనం లాంటివి కూడా ఆరోగ్యకరమే! ఆవిరి మీద ఉడికించిన చికెన్, చేప ముక్కలు లేదా గ్రిల్ చేసినవీ పిల్లలకు అందించవచ్చు. పండ్లముక్కలతో కస్టర్డ్ తయారుచేసి పెట్టవచ్చు.

ఆకలి తెలియనివ్వాలి

సాధారణంగా భోజన వేళకు పిల్లలు కూడా కడుపు నిండా తినడం అన్నిసార్లూ వీలుపడకపోవచ్చు. అప్పుడప్పుడూ పిల్లల ఆకలి మందగిస్తూ ఉంటుంది. కాబట్టి తినడానికి పేచీ పెట్టినప్పుడు, బలవంతంగా తినిపించే ప్రయత్నం చేయకూడదు. ఆకలి ఉంటేనే పిల్లలకు ఆహారం అందించాలి. భయపెట్టి, బుజ్జగించి తినిపించడం వల్ల తల్లులు ఆశించే ప్రయోజనం నెరవేరకపోవచ్చు. సాధారణంగా తల్లులు, బడికెళ్లే ఈడు వరకూ పిల్లలకు ముద్దలు చేసి తినిపిస్తూ ఉంటారు. కానీ ఈ పద్ధతి కూడా సరికాదు. నడక వచ్చిన వయసు నుంచే పిల్లలు స్వతంత్రంగా తినే అలవాటు చేయాలి. ప్రతి రోజూ ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో తినే ఏర్పాట్లు ఉండాలి. పదార్థాలు నేల మీద పడిపోతాయనో, పిల్లలు చిందరవందర చేస్తారనో, దుస్తులు పాడైపోతాయనో పిల్లలను సొంతగా ఆహారం తిననివ్వకుండా అడ్డుకోకూడదు. పిల్లల కోసం ప్రత్యేకంగా తయారయ్యే స్పూన్లు, ఫోర్కులు, బౌల్స్, ప్లేట్స్‌నే వాడుకోవడం వల్ల వాటితో పిల్లలకు గాయాలు అవకుండా ఉంటాయి. నేల మీద పడినా పగిలిపోకుండా ఉండే పదార్థాలతో తయారైన పాత్రలు, స్పూన్లనే వాడుకోవాలి.

గ్యాస్ వేధిస్తుంటే..

వేళకు తినకపోవడం, తిన్నా అరగకపోవడం చాలా మందికి ఎదురయ్యే సమస్య. వేపుళ్లు, జంక్ ఫుడ్, అధిక నూనెతో వండిన వంటకాలను తినటం వల్ల గ్యాస్ పెరిగి కడుపుబ్బరం సమస్య ఏర్పడుతుంది. దీనికి చిన్న చిట్కాలతో పరిష్కారం లభిస్తుంది. అవేమిటో చూద్దాం..

సమస్య మూలమిది: మనం తిన్న ఆహారం కడుపులోకి వెళ్లిన తరువాత.. జీర్ణం అవుతుంది. ఆ జీర్ణప్రక్రియలో కొన్ని రకాల వాయువులు విడుదలవుతాయి. కొన్ని సార్లు.. అవి బయటికి వెళ్లకుండా కడుపులోను, పేవులలోను పేరుకుపోతాయి. అవి చెడువాయువులుగా మారి ఇబ్బంది పెడతాయి. ఆయుర్వేదంలో ఈ సమస్యను ఆర్మానం, ఆటోపం అంటారు. ఈ వాయువులు బయటకు వెళ్లకపోతే ఆ ప్రభావం గుండె.. ఊపిరితిత్తులపై పడుతుంది. గుండె దడ, ఆందోళన, గుండెల్లో నెప్పి మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ప్రతి రోజు క్రమం తప్పకుండా పల్చటి మజ్జిగ తాగితే ఈ సమస్య చాలా వరకూ పరిష్కారమవుతుంది.

చిట్కాలివే: అరిటి బోద లోపల తెల్లటి పదార్థం ఉంటుంది. దీని రసాన్ని రోజుకు ఒక కప్పు చొప్పున 15



రోజులు తాగితే గ్యాస్ సమస్య తగ్గిపోతుంది.

- అల్లం రసం తీసి దానిని వేడిచేసి తగినంత బెల్లం కలపాలి. ఇలా కలిపిన మిశ్రమాన్ని రోజుకు ఒక స్పూను తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కడుపుబ్బరం తగ్గిపోతుంది.
- గింజలున్న ఎండిన నల్ల ద్రాక్షను తీసుకొని నీళ్లలో ఆరు గంటలు నానబెట్టాలి. ఇలా నానిన ద్రాక్ష రసాన్ని తాగితే గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- శొంఠిపొడి, పాత బెల్లంపొడిలను సమ పాళ్లలో కలుపుకోవాలి. ప్రతి రోజూ ఉదయం ఈ మిశ్రమాన్ని ఒక స్పూను తినాలి. ఆ తర్వాత వేడి నీళ్లు తాగాలి. ఇలా తాగితే కడుపులో ఉన్న మలినాలన్నీ తొలగిపోతాయి.
- ధనియాలు, శొంఠిలను సమపాళ్లలో తీసుకొని.. వేడి నీటిలో మరిగించాలి. అలా తయారయిన కషాయాన్ని తాగి నడిస్తే- గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- సోంపు, జీలకర్ర, వాములను సమపాళ్లలో తీసుకొని పొడి చేయాలి. ఈ పొడిని ఉదయం, సాయంత్రం ఒక స్పూను చొప్పున వేడి నీళ్లలో వేసుకొని తాగాలి. ఇలా తాగితే వారం రోజుల్లో గ్యాస్ సమస్య తొలగిపోతుంది.

బ్లడ్ గ్రూప్ డైట్

కార్బ్స్ కావలసిందే!

కార్బ్స్‌ను పూర్తిగా దూరం పెట్టేసే డైట్ ట్రెండ్‌ను విస్తృతంగా అనుసరించేవాళ్లున్నారు. కానీ శక్తిని సమకూర్చే పిండిపదార్థాలను పూర్తిగా మానేస్తే శరీరానికి శక్తి సమకూరేదెలా? మంచి, చెడు పిండిపదార్థాల్లో వేటిని ఏ పరిమాణంలో తీసుకోవాలో అవగాహన ఏర్పరుచుకుని తదనుగుణంగా మసలుకోవాలి.

పిండిపదార్థాలు ప్రధాన పోషకాలు. మనం రోజూ తీసుకునే ఆహారంలో 70% పిండిపదార్థాలే ఉంటాయి. జీర్ణవ్యవస్థ పిండిపదార్థాలను గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం ఈ గ్లూకోజ్‌ను కణజాలం, కణాలు, అవయవాల శక్తి కోసం వినియోగిస్తుంది. కాబట్టి శక్తినిచ్చే పిండిపదార్థాలు పూర్తిగా మానేయడం అవివేకం.

పిండిపదార్థాలు లోపిస్తే?

శక్తికి మూలాలైన పిండిపదార్థాలు లోపిస్తే శరీరం పలు లక్షణాల రూపంలో ఆ లోపాన్ని బహిర్గతపరిచే ప్రయత్నం చేస్తుంది. అవేంటంటే...

- నీరసం
- నోటి దుర్వాసన
- మలబద్ధకం
- వాంతులు
- తలనొప్పి
- పోషకలోపం

డి - గ్లూకోజ్

అత్యంత ముఖ్యమైన, కీలకమైన పిండిపదార్థం గ్లూకోజ్. అన్ని జీవరాశులు శక్తి కోసం వాడుకునే సులువైన చక్కెర (మోనోశాఖరైడ్) ఇది. అయితే పిండిపదార్థాలు శరీర బరువును కచ్చితంగా పెంచుతాయి. అవసరం లేని చెడు పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ, అవసరం ఉన్న మంచి పిండిపదార్థాలను పరిమితంగా తీసుకునేవారికి ఈ సమస్య సహజం. కాబట్టి వాటిలో ఏవి మంచి, ఏవి చెడు? అనే విషయం మీద అవగాహన ఏర్పరుచుకోవాలి.



మంచి పిండిపదార్థాలు (కాంప్లెక్స్ కార్బ్స్)

వీటిలోని రసాయన రూపం, పీచులను జీర్ణం చేసుకోవడానికి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చుచేయవలసివస్తుంది. వీటి నుంచి అందే శక్తి శరీరానికి ఎక్కువ సమయంపాటు ఉపయోగపడుతుంది. మంచి పిండిపదార్థాలలో...

- పోషకాలు, పీచు ఎక్కువ
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ
- తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండుతుంది
- శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం (మెటబాలిజం) పెరుగుతుంది.

పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్, రొట్టెలు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలు, చిలకడదుంపలు, తాజా పళ్లు ఈ కోవకు చెందినవి.

చెడు పిండిపదార్థాలు (సింపుల్ కార్బొహైడ్రేట్స్)

ఇవన్నీ పొట్టు తీసి, పాలిష్ చేసిన పదార్థాలు. వీటిలో సహజసిద్ధ పోషకాలు, పీచు తక్కువ. చెడు పిండిపదార్థాల్లో...

- పీచు, పోషకాలు అతి స్వల్పం
- గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ
- క్యాలరీలు కొవ్వుగా మారతాయి
- అత్యధిక గ్లూకోజ్ స్థాయిలు (నీరసం తెప్పిస్తాయి)

చాక్లెట్లు, తీపి పదార్థాలు, తీపి జోడించిన తృణధాన్యాలు, సోడాలు, శీతల పానీయాలు, పొట్టు తీసిన పిండ్లు ఈ కోవకు చెందినవి.

మేలురకం పిండిపదార్థాలు వీటిలో...

ఓట్స్‌తో తయారైన బిస్కెట్లు, నారింజ రసం, యాపిల్, కేరట్లు, టమేటాలు, ఎండుద్రాక్ష, ద్రాక్ష, అరటిపళ్లు.

- **ఓట్‌మీల్:** ఎక్కువ సమయంపాటు శక్తినిచ్చే నిలకడైన పిండిపదార్థం ఇది. నీళ్లు కలిపి తయారుచేసిన ఒక కప్పు ఓట్‌మీల్‌లో 159 క్యాలరీలు ఉంటాయి. 4 గ్రాములు పీచు, 6 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **యాపిల్:** భోజనానికి, భోజనానికి మధ్య తీసుకోవలసిన ఈ అల్పాహార ఫలంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే 4 గ్రాముల పీచు, పెక్టిన్‌లు ఉంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే వేరుసెనగపప్పుతో తయారయ్యే వెన్నతో కలిపి తీసుకుంటే ప్రయోజనకరం.
- **చిలకడదుంపలు:** ఇది నిజమైన 'సూపర్ ఫుడ్'. కప్పు చిలకడదుంప ముక్కల్లో 7 గ్రాముల పీచు, అత్యధిక విటమిన్ ఎ, సిలు, 4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **మినుములు:** ఒక కప్పు ఉడకబెట్టిన పొట్టు తీయని మినుముల్లో 15 గ్రాముల పీచు, అంతే పరిమాణంలో మాంసకృత్తులు ఉంటాయి. ఇంత పరిమాణంలో పోషకాలు మరే పదార్థంలోనూ ఉండవు.
- **టమేటాలు:** వీటిలో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలం. పీచుతో పాటు లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంటు కూడా వీటిలో ఉంటాయి.